క్లుప్తంగా

మానవ జీవన దిక్సూచి భగవద్గీత



ప్రసంగిస్తున్న వక్త రాధారాణి

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజం కళాశాలలో 'భగవద్గీత , జీవన సాఫల్యత'అనే అంశంపై ప్రసంగం జరిగింది. ముఖ్య వక్త బి.రాధారాణి ప్రసంగిస్తూ భగవద్గీత చదవడం వల్ల వ్యక్తికి తన గమ్యం, శక్తి సామర్థ్యాలతో పాటు ప్రపంచంతో గల సంబంధ బాంధవ్యాలు అర్థమవుతాయని తెలిపారు. మనిషి తన చుట్టూ ఉన్న పరిస్థితులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో గీతలో శ్రీకృష్ణుడు చక్కగా చెప్పినట్టు తెలిపారు. భగవద్గీతలో మానవుడు పరిపూర్ణంగా ఎదగడానికి అనుసరించాల్సిన మార్గం గురించి వివరంగా తెలపబడిందన్నారు. ఈ గ్రంథ పఠనం మనస్సుపై అద్భుతమైన ముద్ర వేస్తుందని, ప్రపంచంలో కోట్లాది మంది చదువుతూ పరమోత్కృష్ట ప్రయోజనాన్ని పొందారని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రసంగాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్



జగన్నాథపురంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం దోమల నియంత్రణకు ఫాగింగ్ చేశారు. జగన్నాథపురం, గోశీలపాలెం, నందగిరినగర్, శ్రీనివాసనగర్, చెక్కుడురాయి బిల్డింగ్, మాదేటి గార్డెన్స్ ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా జీవీఎంసీ సిబ్బంది మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. వారం రోజులు పైబడి నీరు నిల్వ ఉంటే డెంగ్యూ, మలేరియా దోమలు వృద్ధి చెందుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో నకిలీ నోట్ల చలామణి



రూ.200 నకిలీ నోటు

గోపాలపట్నం: గోపాలపట్నంలో నకిలీ నోట్లు చలామణి కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గుర్తు తెలియని ఒక వ్యక్తి గోపాలపట్నంలోని ఓ మెడికల్ దుకాణానికి వచ్చి మందులు కొనుగోలు చేశారు. ఆయన ఇచ్చిన నగదులో ఒక రూ.200 నకిలీ నోటు వచ్చింది. ఐతే, ఆ సమయంలో దుకాణ యజమాని నోటును పరిశీలించలేదు. కొద్దిసేపటి తరువాత తాను పేమెంట్ చేసే సమయంలో చూడగా నకిలీ నోటుగా గుర్తించారు. దీన్ని ఏవిధంగా మార్చుకోవాలో అర్థం కావడం లేదని దుకాణ యజమాని వాపోతున్నాడు.

చెత్తమయం

- 50వ వార్డులో అధ్వానంగా పారిశుధ్యం
- సకాలంలో కానరాని వ్యర్థాల తొలగింపు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



మురళీనగర్ గెడ్డలో పూడికలు



మాధవధార కొండ ప్రాంతం పక్కన వ్యర్థాలు



కొండ మలుపులో చెత్తాచెదారం

మర్రిపాలెం:

స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు సక్రమంగా అమలు కావడం లేదు. జీవీఎంసీ 50వ వార్డులో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల పారిశుధ్య కార్మికులు వాటిని తొలగిస్తున్నప్పటికీ ప్రజల్లో చైతన్యం రావట్లేదు. మరికొన్ని చోట్ల అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడు నాలుగు రోజులైనా వ్యర్థాలను తరలించని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

50వ వార్డు మాధవధార స్కేటింగ్ పార్కు కొండవాలు ప్రాంతంలో ఎక్కడి చెత్తను అక్కడే వదిలేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో చెత్త పేరుకుపోయితో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల వ్యర్థాలు పొడిగా ఉన్నాయని, వర్షాలు పడితే పందులు, దోమలు, విష జీవుల బెడద అధికంగా ఉంటుందని చెబుతున్నారు. వ్యర్థాల నుంచి భరించలేని దుర్గంధం వస్తోందని, తద్వారా రోగాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు దృష్టి సారించాలి

మాధవధార మెయిన్ రోడ్డు జంక్షన్‌లో ఉన్న దుకాణాల వెనుక నుంచి మురళీనగర్‌లోకి ఓ ప్రధాన గెడ్డ ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో టిఫిన్, చేపలు తదితర వ్యాపారాలు సాగిస్తున్న షాపులున్నాయి. ఈ దుకాణాల్లోని వ్యర్థాలను వాటి నిర్వాహకులంతా ఆ గెడ్డలో పడేస్తున్నారు. దీంతో మొత్తం గెడ్డంతా వ్యర్థాలతో నిండిపోయింది. దానిలో పందులు చేరి స్వైరవిహారం చేస్తున్నాయి. వార్డులో అధ్వాన పారిశుధ్యంతో ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- స్కేటింగ్ పార్క్ ఎదురుగా రోడ్డు పక్కనున్న డంపర్ బిన్ వద్ద చుట్టుపక్కల నివాసులు రోజూ వ్యర్థాలు పడేస్తున్నారు. మూడు నాలుగు రోజుల నుంచి ఆ చెత్త అలాగే ఉన్నా.. పారిశుధ్య సిబ్బంది ఎవరూ తొలగించడం లేదు. ఎందుకు వ్యర్థాలు తరలించడం లేదని సిబ్బందిని అడిగితే.. దురుసుగా సమాధానం చెప్పి వెళ్లిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు.
- ఇదే దారిలో మాధవధారకు వెళ్లే మలుపు వద్ద ఎప్పుడూ చెత్తాచెదారం, వ్యర్థాలతో కొండ పక్కనే ఉన్న ప్రాంతమంతా ఉంటుంది. తమ ఇళ్లలోని చెత్తను అక్కడే కొందరు స్థానికులు పడేస్తున్నారు. దానిని తొలగించాల్సిన బాధ్యత పారిశుధ్య అధికారుల, కార్మికులదే అయినా అలా చేయకపోవడంతో స్థానికులు విసుగు చెందుతున్నారు.
- ఈ కొండ ప్రదేశం పక్కనే పాడైన, మరమ్మతులకు గురైన వాహనాలను నెలల తరబడి నిలిపి వదిలేశారు. అవి ఎవరివో.. ఏంటో కూడా తెలియని స్థితి.
- రాత్రయితే చాలు ఈ వాహనాల్లో, వాటి వెనుక ఆకతాయిలు కూర్చుని పేకాట, మద్యం తాగడం వంటివి చేస్తున్నారు. అటుగా రాత్రి పూట ఎవరైనా వెళ్లాలంటే భయపడుతున్నారు.



స్కేటింగ్ పార్క్ ఎదురుగా పేరుకుపోయిన చెత్త

పాలిసెట్ ఉచిత శిక్షణకు విశేష ఆదరణ



బాలభాను పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మురళీనగర్: స్థానికంగా నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులకు ఆదరణ పెరుగుతోంది. ఈ ప్రాంతంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్), బాలభాను పాఠశాలలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బాలభాను పాఠశాలలో నిర్వహిస్తున్న తరగతులకు హాజరవుతున్న వారి సంఖ్య 54కు చేరిందని క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి చెప్పారు. వీరికి ఉచితంగా మెటీరియల్ అందిస్తామని తెలిపారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 200 మంది, గైస్‌లో 161 మంది చేరినట్లు ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.నారాయణరావు, డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. వీరందరికి టెక్నికల్ ఎడ్యుకేషన్ ముద్రించిన స్టడీ మెటీరియల్ అందిస్తామని వారు తెలిపారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో 'సాగర్ కవచ్ '

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా డాగ్ స్క్వాడ్ ద్వారా బ్యాగుల్లో వస్తువులను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు పోలీసులను అప్రమత్తం చేయడం కోసం సాగర్ కవచ్ దోహదపడుతుందని ఆర్‌పీఎఫ్ ఎస్ఐ డీజీ రావు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో అనధికార కంటైనర్

- ఏర్పాటు చేసిన త్రీ స్టార్ వాకర్స్ క్లబ్
- కూటమి నాయకుల అండదండలతో కాలువ, రహదారి కబ్జా
- ఫిర్యాదులపై స్పందించని అధికారులు



54వ వార్డులోని ప్రభుత్వ స్థలంలో డ్రైనేజీపై ఏర్పాటు చేసిన భారీ కంటైనర్

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ కూడలి సూర్యారావునగర్‌లో పారిశ్రామిక శిక్షణ కేంద్రం ప్రహరీని ఆనుకుని ఉన్న సుమారు 40 గజాల ప్రభుత్వ స్థలాన్ని త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు కూటమి నాయకుల అండదండలతో కబ్జా చేశారు. త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ కార్యాలయం, లైబ్రరీ పేరుతో ఈ ప్రదేశంలోని పెద్ద కాలువపై సిమెంటు పలకలు వేసి భారీ కంటైనర్ ఆఫీస్ ఏర్పాటు చేశారు. జీవీఎంసీకి చెందిన కాలువ, బీటీ రోడ్డును ఆక్రమించి నిర్మాణ పనులు చేపడుతున్నా.. జోన్-5 టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులు కన్నెత్తి చూడటం లేదని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి, కూటమి నాయకుల అండదండలతో క్లబ్ సభ్యులు అక్రమ నిర్మాణం చేపడుతున్నారని చెబుతున్నారు. స్థానిక కార్పొరేటర్ చల్లా రజని ఈశ్వరరావు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీ కండువా వేసుకుని కూటమి నాయకులతో కలిసి వార్డులో అక్రమ నిర్మాణాలు, కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఆక్రమణలపై జోన్-5 అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు సరికదా.. స్థానిక రాజకీయ నాయకుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వాకర్స్ క్లబ్ నిధులతో స్థల సేకరణ చేసి లైబ్రరీని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుదని పలువురు సూచిస్తున్నా.. జీవీఎంసీ స్థలాన్ని, డ్రైనేజీని ఆక్రమించి భారీ కంటైనర్ ఏర్పాటు చేసి అటు వాహనాలకు.. ఇటు పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పలువురు స్థానికులు తెలియజేశారు.

పకడ్బందీగా ఎస్ఏ-2 పరీక్షలు

- డీఈవో ప్రేమ్‌కుమార్



ఆర్పీ పేట హైస్కూల్లో డ్రాపవుట్ విద్యార్థిని తిరిగి చేర్చుకుంటున్న డీఈవో ప్రేమ్‌కుమార్, ఎంఈవో

కంచరపాలెం: పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్-2ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, ఐటీఐ కూడలి కప్పరాడ ఉన్నత పాఠశాలలను డీఈవో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఏ-2 పరీక్షలను ఉపాధ్యాయులు పక్కాగా నిర్వహించి, మూల్యాంకనం అనంతరం మార్కులను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

డ్రాపవుట్ విద్యార్థుల చేరిక

ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో చదివి, మూడు నెలలు క్రితం పాఠశాల మానివేసి డ్రాప్ అవుట్ అయిన దువ్వి వంశీకుమార్, రాజులను డీఈవో స్వయంగా పాఠశాలల్లో తిరిగి చేర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గోపాలపట్నం మండల పరిధిలోని 7 ప్రభుత్వ పాఠశాలల నుంచి 9 మంది డ్రాపవుట్ అయిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లో చేర్పించామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డి.దివాకర్, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసరావు, గీత, సీఆర్పీలు లంక చైతన్య, పద్మ, లలిత, కరుణ తదితరులు పాల్గొన్నారు.


రెల్లి సామాజిక వర్గానికి న్యాయం చేయాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార: ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని జై గౌతం బాబా సంఘం కన్వీనర్ ఎస్. కళ్యాణ ముని ఆందోళన వ్యక్తం చేశారు. గౌతం బాబా సంఘం, ఏపీ రెల్లి అభివృద్ధి సంఘం, ఇతర రెల్లి సంఘాలతో కలిసి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన దీక్ష నిర్వహించారు. తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెల్లి గ్రూపు కులాలకు 2 నుండి 5 శాతం వరకు రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రెల్లి, ఉపకులాలు ఎప్పుడూ అన్యాయానికి గురవుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 10 లక్షల జనాభా ఉన్న తమకు వర్గీకరణలో 1 శాతం రిజర్వేషన్ ఇవ్వడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వానికి తప్పుడు సమాచారమిచ్చి తమకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. వర్గీకరణలో తమకు జరిగిన అన్యాయంతో తాము, తమ భావితరాలు తీవ్రంగా నష్టపోతామని అన్నారు. ప్రభుత్వం స్పందించి రెల్లి గ్రూపు కులాలకు రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలో రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మధుసూదనరావు, రాష్ట్ర రెల్లి సంఘం ఉపాధ్యక్షుడు వెంకటరావు, వడ్డాది ప్రకాష్, వడ్డాది గోవిందరాజులు, చెన్నా పాల్, మోహన్ కుమార్, రంజిత్ కుమార్, రంజిత తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించాలని వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పించాలని ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జి. గణేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి చింతకాయల బంగర్రాజు కోరారు. బుధవారం రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గాజువాకలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఇవ్వాలని, ఇతర శాఖల అదనపు పని బాధ్యతలను తొలగించాలని, అధిక పని వత్తిడి తగ్గించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో విశాఖ జిల్లా నాయకులు పి. అనిల్‌ప్రకాష్, డి.శివ, అలీ మొహిద్దీన్, జి. చందు, డి. భాస్కర్, పి. నవీన్, ఎస్. శివ తదితరులు ఉన్నారు.

గెడ్డ ముంపుతో ఇక్కట్లు

- మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పొంగిన గోశీలపాలెం గెడ్డ
- పేరుపోయిన వ్యర్థాలు
- మురుగు పోయే మార్గం లేక ఇళ్లలోకి చేరిన చెత్తాచెదారం
- రాత్రంతా ఇబ్బందులకు గురైన స్థానికులు



గెడ్డ డకింగ్‌లో చిక్కుకున్న చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సీతంపేట: మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో గెడ్డల నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో బయటపడింది. జీవీఎంసీ 43వ వార్డు గోశీలపాలెం గెడ్డపై బాక్సు కల్వర్టు నిర్మాణంలో ఉండగా, మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గెడ్డ పొంగడంతో చుట్టు పక్కల ఇళ్లల్లోకి మురుగు నీరు, వ్యర్థాలు చేరడంతో రాత్రంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గోశీలపాలెం రామాలయానికి వెళ్లే మార్గంలో గెడ్డపై ఉన్న కల్వర్టు శిథిలమవడంతో పాత బ్రిడ్జి తొలగించి సుమారు రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా బాక్సు కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు రోజుల కిందట శ్లాబు వెయ్యడానికి డకింగ్ ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి అక్కయ్యపాలెం, రామకృష్ణానగర్ నుంచి వ్యర్థాలు వర్షపు నీటితో గోశీలపాలెం గెడ్డ వద్దకు కొట్టుకొచ్చాయి. డకింగ్ కారణంగా వ్యర్థాలు, చెత్త వెళ్లే మార్గం లేక పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. దీంతో మురుగు నీరు పోయే మార్గం లేక గెడ్డ పక్కన నివాసాల్లోకి మురుగు నీరు, వ్యర్థాలు చేరడంతో మోకాలి లోతు వరకు మునిగిపోయింది. దీంతో స్థానికులు రాత్రంతా జాగారం చేశారు. బుధవారం ఉదయం 6 గంటలకు పారిశుధ్య సిబ్బంది గెడ్డ వద్దకు చేరుకుని వ్యర్థాలు తొలగించేందుకు తీవ్రంగా శ్రమించారు. సుమారు 12 గంటల పాటు శ్రమించి గెడ్డ కింద ఒక వైపు డకింగ్, వ్యర్థాలు తొలగించి మురుగు పోయే వీలు కల్పించారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో పువ్వుల దుకాణాలు, చేపల బజారులోని దుకాణాలు, థర్మాకోల్ బాక్సులు, ప్లాస్టిక్ బాటిళ్లు, పాడైన పువ్వులు, దండలు పెద్ద ఎత్తున గెడ్డలో పడవేస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. పారిశుధ్య సిబ్బంది సక్రమంగా గెడ్డలోని వ్యర్థాలను తొలగించక పోవడంతో చిన్నపాటి వర్షానికి ఇళ్లల్లోకి మురుగు నీరు చేరి రాత్రంతా ఇబ్బందులకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి భవిష్యత్‌లో మళ్లీ ఇటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.



గోశీలపాలెం గెడ్డలో నిలిచిపోయిన వ్యర్థాలు



గోశీలపాలెంలో ఇళ్లలోకి చేరిన మురుగు

స్పోర్ట్స్ క్లబ్ నిర్లక్ష్యం వల్లే బాలుడి మృతి



మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి. పక్కన సీఐ సత్యనారాయణ

సీతమ్మధార: స్పోర్ట్స్ క్లబ్ నిర్లక్ష్యం వల్ల ఏడేళ్ల బాలుడు రుషి మృతి చెందాడని, కేసు నమోదు చేశామని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి వెల్లడించారు. ఫోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ఘటనలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ యాజమాన్యం నిర్లక్ష్యం ఉందని, వాటర్ పార్క్ వద్ద నైపుణ్యం గల నిపుణులు లేరన్నారు. రక్షణ చర్యలు పాటించలేదని, సమయం దాటిన తర్వాత టికెట్ అమ్మకాలు సరికాదని, సరైన అనుమతులు కూడా తమకు చూపించలేదని పేర్కొన్నారు. తల్లిదండ్రులను సమీపంలోకి అనుమతించక పోవడం సరికాదన్నారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ ఎ.సత్యనారాయణ, ఎస్ఐ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

లోకో పైలెట్ల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్

తాటిచెట్లపాలెం: ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రన్నింగ్ స్టాఫ్ అత్యవసర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ జె. సంపత్‌కుమార్ తెలిపారు. దొండపర్తిలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జోన్‌లో మాత్రమే రన్నింగ్ స్టాఫ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రైల్వే బోర్డు నిబంధనలను పాటించకుండా, రన్నింగ్ స్టాఫ్‌పై పని ఒత్తిడి అధికం చేస్తున్నారని తెలిపారు. ఈ జోన్ పరిధిలో గల వాల్తేర్, సంబల్‌పూర్, ఖుర్దారోడ్ డివిజన్లలో కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ ఉద్యోగులపై పనిభారం పెంచుతున్నారన్నారు. ప్రధానంగా రన్నింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న 6 సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. లోకో సిబ్బందికి మినిమం గ్యారంటీడ్ కిలోమీటర్లు వర్తింపజేయడం లేదని, తొమ్మిది గంటల పని వేళలకు దక్కవలసిన ప్రతిఫలం నిబంధన ఇక్కడ అమలు చేయడం లేదని, రన్నింగ్ సిబ్బందికి సరైన రెస్ట్‌రూంలు లేక విశ్రాంతి కూడా తీసుకోలేక పోతున్నారని తెలిపారు. ఈ విధంగా రైల్వే బోర్డు ప్రతిపాదించిన పలు నిబంధనలను ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో అమలు చేయడం లేదన్నారు. ఈ విషయమై మార్చి 26వ తేదీన ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రమేష్ చంద్ర సాహూ, జనరల్ మేనేజర్‌కు 12 పేజీల వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై ఇంత వరకు స్పందించలేదని సంపత్‌కుమార్ తెలిపారు. రన్నింగ్‌స్టాఫ్ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 18 నుంచి నిరాహారదీక్ష ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. నరసింగరావు, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి. మాహేశ్వరరావు, కేంద్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ఎస్ఎల్‌కోటేశ్వరరావు, బి. సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎంవీ పాపారావు, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ ఎం. రవికాంత్, బ్రాంచి సెక్రటరీలు కేవీ గిరిధర్, ఎస్. రాజశేఖర్, ఆర్. మోహన్‌బాబు, రన్నింగ్ స్టాఫ్ ఎం.ఎస్.రావు, ఆర్.మోహన్, పి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ముందుకు వచ్చిన సముద్రం

నిలిచిన బోటు షికారు



రుషికొండ వద్ద ముందుకు వచ్చిన సముద్రం

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ వద్ద బుధవారం సముద్రం భారీ కెరటాలతో ముందుకు చొచ్చుకుని వచ్చింది. మత్స్యకారులు తీరం వద్ద ఉంచిన పడవలను, టూరిజం బోట్లను కెరటాలు తాకడంతో పర్యాటకులు భయభ్రాంతులకు గురయ్యారు. వాతావరణ మార్పుల వలన సముద్రంలో బలమైన ఈదురు గాలులుతో పాటు కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో మత్స్యకారులు అప్రమత్తమై బోట్లను, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సాధారణ రోజుల కంటే బుధవారం సముద్రం బాగా ముందుకు వచ్చిందని ఇక్కడ మత్స్యకారులు తెలిపారు. ఇక్కడ నిర్వహిస్తున్న బోటు షికారును వాతావరణం ప్రతికూలంగా మారడంతో ప్రస్తుతం నిలిపివేశారు. రెండు టూరిజం బోట్లను, నాలుగు ప్రైవేటు బోట్లను తీరానికే పరిమితం చేశారు.